క్లుప్తంగా

ప్రభుత్వాసుపత్రిలో న్యాయవిజ్ఞాన సదస్సు



న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మరావు

కొవ్వూరు: మంగళవారం ప్రపంచ మానసిక వైద్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. హైకోర్టు ఆదేశాల మేరకు లీగల్ సర్వీసెస్ అథారిటీ కొవ్వూరు మండల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.ధర్మరావు ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆయన ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పలు రకాల చట్టాల గురించి వైద్యులకు వివరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.సాయికిరణ్, న్యాయవాది ఎం.శ్రీవల్లి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్టు

నిడదవోలు: ఇద్దరు బైక్ దొంగలను నిడదవోలు పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్సై పి.నాగరాజు కథనం ప్రకారం.. తన బైక్ పోయిందంటూ బెండపూడి గ్రామానికి చెందిన గోపిచిట్టి తేజ రామకృష్ణ ఈ నెల 9న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో తణుకు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన లకోక్కల నవీప్రేమ్, సిద్ధాంతం గ్రామానికి చెందిన కుడుపూడి వసంత శేఖర్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.80 వేల విలువైన రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, తణుకు, పెనుగొండ, ఇరగవరం పోలీస్ స్టేషన్లలో 30కి పైగా కేసులున్నాయని ఎస్సై నాగరాజు తెలిపారు.

వైద్య శిబిరం ఏర్పాట్ల పరిశీలన

నిడదవోలు: పట్టణంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో బుధవారం నిర్వహించే వైద్య శిబిరం ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పరిశీలించారు. శిబిరానికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్, వైద్యాధికారులకు సూచించారు. ఎన్టీఆర్ కాలనీ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జి. హేనా తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

- రేపు సామర్లకోట రానున్న ముఖ్యమంత్రి జగన్
- జగనన్న కాలనీ ప్రారంభం
- రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షలకు పైగా ఇళ్లకు ఇక్కడి నుంచే ప్రారంభోత్సవం
- సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సామర్లకోట జగనన్న కాలనీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న దవులూరి దొరబాబు, కలెక్టర్ కృతికా శుక్లా

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం సామర్లకోట రానున్న నేపథ్యంలో ఆయన పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. సీఎం పర్యటన ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జిల్లా స్థాయి అధికారులతో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జగనన్న కాలనీలో ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైన్లు, లైటింగ్, ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ సదుపాయం కల్పించామన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే మార్గం మినహా మిగిలినచోట్ల ఎటువంటి ఆంక్షలూ ఉండవని చెప్పారు. సీఎం పర్యటనకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా పెద్దాపురం నియోజకవర్గానికి వస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలకడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి కావడంతో.. వీటన్నింటినీ సామర్లకోట జగనన్న కాలనీ నుంచి సీఎం జగన్ ప్రారంభించనుండటం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. హైదరాబాద్‌లోని లేఅవుట్లలో కూడా లేని విధంగా సామర్లకోట జగనన్న కాలనీలో ఏడు పార్కులను అత్యంత సుందరంగా తీర్చి దిద్దామని తెలిపారు. జగనన్న కాలనీలో రూ.15 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలకు రూ.32 వేల కోట్లు కేటాయించారన్నారు. కలెక్టర్ కృతికా శుక్లా కృషితోనే మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరిగిందని చెప్పారు. ఈ కాలనీలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారని దొరబాబు తెలిపారు.

అధికారులకు బాధ్యతల కేటాయింపు

ముఖ్యమంత్రి పర్యటనకు సామర్లకోట – పెద్దాపురం రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిపాడ్, జగనన్న కాలనీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని సీఎం సభా వేదికను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి వివిధ బాధ్యతలను ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా అప్పగించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, ఏఎస్పీ పి.శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఆబ్బిరెడ్డి రమణారెడ్డి, ఆర్డీఓలు ఎస్‌వీవీ సత్యనారాయణ, జె.సీతారామారావు, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి నరసింహనాయక్, పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఏఓ ఎం.ఏసుబాబు, మున్సిపల్ కమిషనర్లు జె.రామారావు, గంపా సురేంద్ర, తహసీల్దార్లు ఎస్‌ఎల్‌వీ కుమారి, వజ్రపు జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పసికందును అమ్మేసిన ప్రియుడు

- రూ.3.20 లక్షలకు బేరం
- బాలింతకు బెదిరింపులు, ప్రలోభాలు
- ఐదుగురి అరెస్టు

అమలాపురం టౌన్: తన ప్రేయసి అయిన బాలింతను బెదిరించి, ప్రలోభపెట్టి పది రోజుల పసికందును అపహరించి, అమ్మేశాడో ప్రియుడు. అమలాపురం పట్టణం గొల్లగూడెంలో ఈ నెల నాలుగో తేదీన జరిగిన ఈ ఘటనపై పోలీసులు లోతైన దర్యాప్తు చేసి, ప్రియుడితో పాటు ఇందుకు సహకరించిన వారిని, పసికందును కొన్నవారిని అరెస్టు చేశారు. అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ మంగళవారం రాత్రి ఈ వివరాలు వెల్లడించారు. గొల్లగూడేనికి చెందిన పసుపులేటి వరలక్ష్మి (34)కి గతంలో వివాహమైంది. భర్త వదిలేయడంతో విడిగా ఉంటోంది. ఆమె అమలాపురంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో స్వీపరుగా పని చేస్తోంది. పట్టణానికి చెందిన వంట మేస్త్రి కొత్తపల్లి రాము, వరలక్ష్మి మూడేళ్లుగా సహ జీవనం చేస్తున్నారు. రాము వల్ల గర్భవతి అయిన వరలక్ష్మి గత నెల 25వ తేదీన ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈ నేపథ్యంలో రాముకు కొంత మంది డబ్బు ఆశ చూపడంతో ఆ పసికందును అమ్మేయడానికి సిద్ధమయ్యాడు. ఈ నేపథ్యంలో తల్లి వరలక్ష్మిని బెదిరించి, ప్రలోభపెట్టి ఈ నెల నాలుగో తేదీన ఆ పసికందును కాకినాడ తీసుకుని వెళ్లి వేరే వారికి అమ్మేశాడు. వారు తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలానికి చెందిన పిల్లలు లేని ఒక జంటకు ఆ పసికందును రూ.3.20 లక్షలకు అమ్మేశారు. ఈ సొమ్ములో తల్లి వరలక్ష్మికి రూ.1.40 లక్షలు మాత్రమే ఇచ్చారు. ఆ డబ్బుల్లో ప్రియుడు రాము రూ.20 వేలు వాడేసుకున్నాడు. దీనిపై వరలక్ష్మి గత ఆదివారం అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ టి.క్రాంతికుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. ఘటన తీవ్రత దృష్ట్యా జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆదేశాల మేరకు డీఎస్పీ అంబికా ప్రసాద్ పర్యవేక్షణలో దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులను గుర్తించారు. వీరిలో ఐదుగురిని అరెస్టు చేశారు. అమలాపురానికి చెందిన కొత్తపల్లి రాము, విత్తనాల వారి కాల్వ గట్టుకు చెందిన పెయ్యల బాలరాజు, కాకినాడ విఘ్నేశ్వర నగర్‌కు చెందిన మద్రి స్వర్ణ ప్రకాష్, బిక్కవోలు మండలం పందలపాకకు చెందిన గుణ్ణం భానుకిరణ్, కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన ఓదూరి సురేష్‌లను పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. నిందితులను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. పసికందును తల్లి వరలక్ష్మికి పోలీసులు అప్పగించారు.

సుపరిపాలనను ఆశీర్వదించండి

- హోం మంత్రి తానేటి వనిత
- ఐ.పంగిడిలో ఆరో రోజూ కొనసాగిన గడప గడపకూ..



ఐ.పంగిడి వాసుల సమస్యలు తెలుసుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: అన్ని వర్గాలకూ మేలు చేకూరేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకు మరోసారి అండగా నిలవాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత విజ్ఞప్తి చేశారు. 138వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి ఆమె మండలంలోని ఐ.పంగిడిలో కొనసాగించారు. ఈ పంచాయతీ పరిధిలో ఆరో రోజు గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలసి మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్ల నుంచి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని లెక్కలతో సహా వివరించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి హయాంలో ఒక్కో ఇంటికి నాలుగైదు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ మంత్రి ముందుకు సాగారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. వర్షం కురుస్తున్నప్పటికీ లెక్క చేయకుండా మంత్రి వనిత తడుస్తూనే గడప గడపకూ.. కార్యక్రమాన్ని కొనసాగించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, సర్పంచ్ గోశాల నాగర్జున, ఉప సర్పంచ్ ఉప్పులూరి వెంకట ఫణికృష్ణారావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, ఎంపీటీసీ సభ్యులు కోనాల భవాణి, కామన రత్నాజీ, మాజీ సర్పంచ్ కోమటి కృష్ణంరాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు తోట రామకృష్ణ, ఉప్పులూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఆరు పడకల భవనం

నల్లజర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరు పడకలతో నూతన భవనాన్ని త్వరలో నిర్మిస్తారు. ఇందుకోసం వైద్య, ఆరోగ్యశాఖ రూ.9 లక్షలు మంజూరు చేసిందని ఆ పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరావు మంగళవారం తెలిపారు. మందుల నిల్వ గది పక్కనే ఈ భవనాన్ని నిర్మిస్తామని ఆయన చెప్పారు. ఈ భవనానికి నిధులు మంజూరు చేయించిన గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ భవనానికి పంచాయతీరాజ్ ఏఈ బి.వినోద్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ప్లాను వేశారు. త్వరలోనే భవన నిర్మాణం చేపడతారని చెప్పారు.

20 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

తాళ్లపూడి: సారా తయారీదారుడిని, మరో సారా విక్రేతను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. తాళ్లపూడి ఎస్సై కె.వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తూపాకులగూడేనికి చెందిన మట్టపర్తి నాగరాజు సారా తయారీదారుడు. తన ఇంటి వద్ద అమ్ముకునే నిమిత్తం గజ్జరం గ్రామానికి చెందిన దేపాటి నాగేంద్ర అతడి వద్ద నుంచి 20 లీటర్ల సారా కొనుగోలు చేసి తెచ్చుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం ఇద్దరినీ అరెస్టు చేసి, ఆ 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరినీ కోర్టుకు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

పేదలకూ కార్పొరేట్ స్థాయి వైద్యమే లక్ష్యం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- తాడిమళ్లలో పీహెచ్‌సీ సహా పలు నూతన భవనాల ప్రారంభం



తాడిమళ్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: పేదలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని తాడిమళ్ల గ్రామంలో రూ.1.49 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. అలాగే అదే గ్రామంలో రూ.65 లక్షల వ్యయంతో నిర్మించి రెండు గ్రామ సచివాలయ భవనాలను, రూ.43.60 లక్షలతో నిర్మించిన రెండు రైతు భరోసా కేంద్రాల భవనాలను, రూ.20.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, మండల పరిషత్ నిధులు రూ.20.55 లక్షల వ్యయంతో నిర్మించిన ఆరు గ్రావెల్ రోడ్లను ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాడిమళ్ల గ్రామస్తులకు గత నాలుగున్నరేళ్లలో రూ.30.52 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అందించామన్నారు. అలాగే రూ.12.66 కోట్ల వ్యయంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేశామన్నారు. పేదలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. 2019 ఎన్నికలకు ముందు శిథిలావస్థలో ఉన్న తాడిమళ్ల పీహెచ్‌సీ భవనంలో విష సర్పాలు సంచరించేవని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఇక్కడ మెరుగైన వైద్యం అందక రోగులు అవస్థలు పడేవారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు–నేడు పథకంలో పీహెచ్‌సీ రూపురేఖలను మార్చడంతో పాటు నూతన భవనం నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, తాడిమళ్ల పంచాయతీ సర్పంచ్ బయ్యే రాధారాణి, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, గ్రామశాఖ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణరావు, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మానుకొండ చంద్రబాబు, ఉప సర్పంచ్ పెనుగొండ కృష్ణమోహన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ముళ్లపూడి శ్రీనివాస్ కుమార్ చౌదరి, నాయకులు సుంకవల్లి శ్రీహరి, యాళ్ల రామారావు, కాపకాయల సూర్యనారాయణ, ఎంపీడీఓ పి.శామ్యూల్, సొసైటీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి సుధీర్‌కుమార్, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వేగేశ్వరపురంలో 'జగనన్నకు చెబుదాం'

తాళ్లపూడి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయిలో ఈ నెల 11న వేగేశ్వరపురంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తారు. హోం మంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని కాకర్ల రామయ్య కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ టి.రాధిక మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి హోం మంత్రి తానేటి వనిత, జిల్లా కలెక్టర్ మాధవీలత హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే మండల స్థాయి స్పందనలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

ప్రజలంతా సంతృప్తి చెందేలా సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- తాళ్లపాలెంలో గడప గడపకూ..



మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: ప్రజలందరూ సంతృప్తి చెందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు సింగులూరి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు గంధం వెంకటరత్నం (షావుకారు), ఎంపీటీసీ సభ్యుడు బయ్యే కృష్ణబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామంలో నాలుగున్నరేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలను వివరించే బుక్‌లెట్‌లను అందజేశారు. తాళ్లపాలెం గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎర్ర కాలువ ప్రభావంతో నష్టపోయిన రైతులకు పూర్తి నష్ట పరిహారం అందించి ఆదుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఉప సర్పంచ్ గంధం నారయ్య, గ్రామ నాయకులు వీరమళ్ల త్రిమూర్తులు, వంగూరి రాజశేఖర్, యామన గోపాలకృష్ణ, వారా ఉమామహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బొండు ఇసుక అక్రమ తవ్వకాలు అడ్డుకోరా?

- తహసీల్దార్‌ను ప్రశ్నించిన ఎంపీటీసీ సభ్యులు
- వాడీవేడిగా పెరవలి మండల పరిషత్ సమావేశం



గోదావరిలో బొండు ఇసుక అక్రమ తవ్వకాలపై తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు బొకే వెంకటేశ్వర్లు

పెరవలి: గోదావరి నదీ గర్భం నుంచి బొండు ఇసుకను కొందరు అక్రమంగా తరలిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఖండవల్లి ఎంపీటీసీ సభ్యులు బొకే వెంకటేశ్వర్లు, రవి అధికారులను ప్రశ్నించారు. ఒకవేళ బొండు ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉంటే, వాటిని బయట పెట్టాలని వారు డిమాండ్ చేశారు. పెరవలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. అధికారులు, ప్రజాప్రతినిధుల వాదోపవాదాల మధ్య సమావేశం ఆద్యంతం వాడీవేడిగా సాగింది. గోదావరి నుంచి బొండు ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవని తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి సమావేశంలో బదులిచ్చారు. ఈ దశలో బొకే వెంకటేశ్వర్లు, రవి జోక్యం మళ్లీ చేసుకుని అలాంటపుడు ఇసుక తరలింపును ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. ఆర్ఐ, వీఆర్వో, పోలీసులను పంపించి తవ్వకాలను నిలుపుదల చేశామని తహసీల్దార్ బదులిచ్చారు. ఇప్పటికీ తవ్వకాలు చేస్తున్నారు కదా? లారీలను, పొక్లెయిన్‌ను ఎందుకు సీజ్ చేయలేదు వారిద్దరూ నిలదీశారు.

డ్వాక్రా రుణాలకు మామూళ్లు..

డ్వాక్రా మహిళలు బ్యాంకుల నుంచి తీసుకునే రుణాల నుంచి ఐదు శాతం సొమ్మును మామూళ్లుగా డ్వాక్రా సీఏలు వసూలు చేస్తున్నారని పెరవలి, ఖండవల్లి ఎంపీటీసీలు రాపాక ప్రమీల, వనచెర్ల దివ్య సమావేశం దృష్టికి తెచ్చారు. దీనిపై ఏపీఎం నాగరాజు స్పందిస్తూ మామూళ్లు ఎవరు తీసుకున్నారో సభ్యులు లిఖిత పూర్వకంగా ఇస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దశలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ స్పందిస్తూ దాదాపు రూ.9 లక్షల డ్వాక్రా నిధులు స్వాహా చేసిన సీఏపై ఇంత వరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. స్వాహా చేసిన సొమ్ములు ఎందుకు రికవరీ చేయలేదని నిలదీశారు. అదీగాక రిజైన్ చేసిన సీఏకు, సస్పెండ్ అయిన సీఏకు ఇప్పటికీ జీతాలు ఎందుకు చెల్లిస్తున్నారు ప్రశ్నించారు. ఒక దశలో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేయడంతో స్వాహా చేసిన నిధులను సంబంధిత సీఏ నుంచి వసూలు చేస్తామని ఏపీఎం నాగరాజు బదులిచ్చారు. కొత్తపల్లి అగ్రహారంలో పంచాయతీ చేపల చెర్వు వేలం పాటలో అక్రమాలపై సభ్యులు సభలో ప్రస్తావించారు. సమావేశంలో ఎంపీడీఓ దామోదరరావు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీల అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.

81 సచివాలయాలకు సొంత భవనాలు

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- కురుకూరులో ప్రభుత్వ భవనాలు ప్రారంభం



కురుకూరులో గ్రామ సచివాలయ భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: మండలంలోని కురుకూరు గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయ, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం భవనాలను మంగళవారం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.65 లక్షల వ్యయంతో ప్రభుత్వ భవనాలను నిర్మించామన్నారు. నియోజకవర్గంలోని 81 గ్రామ సచివాలయాలకు సొంత భవనాలను నిర్మించామని చెప్పారు. అన్నిరకాల సేవలు గ్రామ సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, దరఖాస్తు చేసిన 24 గంటల్లో సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఒకొక్క హెల్త్ క్లినిక్‌లో ఇద్దరు డాక్టర్లు, తొమ్మిది మంది సిబ్బందిని నియమించినట్టు ఎమ్మెల్యే తలారి చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కొయ్యలమూడి అనంతలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, నియోజకవర్గ మహిళా కన్వీనర్ గారపాటి రమాప్రభ, గ్రామ కమిటీ అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు కరుటూరి నిత్యానందం, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కోటాలో టెన్నికాయిట్‌ను చేర్చేలా కృషి చేస్తా

- గోపాలపుం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- హేమమాధురికి రూ.50 వేల నగదు బహుమానం



టెన్నికాయిట్‌లో స్వర్ణ పతకం సాధించిన హేమమాధురికి రూ.50 వేల నగదు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి: స్పోర్ట్స్ కోటాలో టెన్నికాయిట్‌ను చేర్చేందుకు ప్రభుత్వ పరంగా కృషి చేస్తానని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. సౌతాఫ్రికాలో ఇటీవల నిర్వహించిన ప్రపంచ కప్ టెన్నికాయిట్ అండర్–23 విభాగంలో దేవరపల్లికి చెందిన జి.హేమమాధురి ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం వహించి, స్వర్ణ పతకం, రెండు కాంస్య పతకాలు సాధించింది. ఈ క్రమంలో మంగళవారం దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆమెను అభినందించి, తన సొంత నిధులు రూ.50 వేల నగదు ప్రోత్సాహక బహుమతిగా అందించారు. కేంద్ర ప్రభుత్వ స్పోర్ట్స్ కోటాలో టెన్నికాయిట్‌కు రిజర్వేషన్ ఉన్నందున, రాష్ట్రస్థాయిలో కూడా వర్తింపజేయాలని క్రీడాకారిణి హేమాధురి ఎమ్మెల్యేను ఈ సందర్భంగా కోరారు. ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళతానని ని తలారి హామీ ఇచ్చారు. క్రీడాకారిణి హేమమాధురిని అభినందించిన వారిలో సర్పంచ్ కడిమి వీరకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, శాప్ మాజీ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్, పలువురు పీఈటీలు ఉన్నారు.

పొగాకు రైతులకు ఎరువుల పంపిణీ



ఎరువులు పంపిణీ చేస్తున్న ఆర్ఎం ఆదిశేషయ్య, రైతు సంఘం ప్రతినిధులు, పొగాకు బోర్డు సిబ్బంది

గోపాలపురం: వర్జీనియా పొగాకు రైతులకు పొగాకు బోర్డు ద్వారా ఎరువులు అందుబాటులోకి వచ్చాయని రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య అన్నారు. గోపాలపురం పొగాకు వేలం కేంద్రం వద్ద మంగళవారం ఆయన రైతులకు ఎరువుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ఎం ఆదిశేషయ్య మాట్లాడుతూ బోర్డు అనుమతికి మించి పొగాకును ఉత్పత్తి చేయరాదన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయాలని గోపాలపురం పొగాకు వేలం నిర్వహణాధికారి అమల్ డీ శ్యామ్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రైతు సంఘం అధ్యక్షుడు పిన్నమనేని మధుమోహన్, ఎరువుల కమిటీ చైర్మన్ పరిమి జగదీష్, కార్యదర్శి ఇల్లూరి రాంబాబు, కొడవటి వెంకటేశ్వరరావు, సీనియర్ గ్రేడింగ్ అధికారి టి. హేమస్మిత, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- దూబచర్ల, గుడ్డిగూడెం వైద్య శిబిరాల సందర్శన
- కురుకూరు శిబిరం ప్రారంభం
- డివిజన్‌లోని ఏడు చోట్ల వేలాది మంది పేదలకు వైద్యం

నల్లజర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఈ వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోందని ఆయన చెప్పారు. మండలంలోని దూబచర్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. పిల్లల వైద్యుడు స్వాగత్, గైనకాలజిస్టు హేమ, దూబచర్ల పీహెచ్‌సీ డాక్టర్లు గంగాధరరావు, రాజశేఖర్ మొత్తం 610 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 26 మందిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఎమ్మెల్యేతో పాటు నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, దూబచర్ల సర్పంచ్ తాడిగడప బాలయ్య, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గుడ్డిగూడెంలో 255 మందికి..

గోపాలపురం: మండలంలోని గుడ్డిగూడెం సచివాలయం వద్ద మంగళవారం సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సందర్శించారు. శిబిరంలో 255 మంది రోగులకు వైద్యులు బీపీ, షుగర్, కంటి, ఎముకల వ్యాధులకు పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నలుగురు రోగులను రాజమహేంద్రవరం ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సర్పంచ్ మడిచర్ల ప్రసాద్, నాయకులు తోట నాగేశ్వరరావు, రత్నాజీ, ప్రభాకరరావు హుకుంపేట, గోపాలపురం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దూబచర్లలో రోగులకు మందుల కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



సత్యవాడలో మందులు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర రామయ్య

ఇప్పటి వరకూ నియోజకవర్గంలో 30 శిబిరాలు

దేవరపల్లి: మండలంలోని కురుకూరులో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇప్పటి వరకూ 30 వైద్య శిబిరాల ద్వారా సుమారు 1,500 మందికి వైద్య సేవలు, మందులు అందించామన్నారు. 250 మందిని మెరుగైన వైద్యం కోసం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేసినట్టు తెలిపారు. వైద్య శిబిరం వద్ద ఏర్పాటు చేసిన ఐదు వార్డులను, ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే తలారి పరిశీలించారు. వైద్యులు సాంబశివరావు, మంజునాథ, వర్మ, సురేఖ, అశ్వవర్ధన 404 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 10 మందిని ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. సర్పంచ్ కొయ్యలమూడి అనంతలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పాట్టి స్వర్ణలత, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీటీసీ సభ్యుడు కరుటూరి నిత్యనందం తదితరులు పాల్గొన్నారు.

సత్యవాడలో 551 మందికి..

ఉండ్రాజవరం: మండలంలోని సత్యవాడలో సర్పంచ్ ఇందుకూరి దేవీభార్గవి ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్ ఎస్‌జే ఇర్ఫాన్ ఆధ్వర్యంలో రియా సుజన్ (నేత్ర వైద్యం), శ్రీనివాసు (చర్మవ్యాధుల నిపుణులు), ఉషాదేవి (జనరల్ మెడిషన్)లు మొత్తం 551 మంది రోగులకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. వారిలో ఐదుగురిని ఆపరేషన్ల నిమిత్తం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య వైద్య శిబిరాన్ని సందర్శించి రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, ఐవీఎస్ రాజు, పెనుమత్స గణపతిరాజు, పెనుమత్స సుబ్బరాజు, కె.శ్యాంబాబు, మరపట్ల నాగరాజు, పెనుమత్స శ్రీనివాసరాజు, నాగేశ్వరరావు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్యాలలో 396 మందికి..

నిడదవోలు రూరల్: మండలంలోని పెండ్యాల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆ పంచాయతీ సర్పంచ్ కారింకి అన్నవరం ప్రారంభించారు. కానూరు పీహెచ్‌సీ వైద్యుడు హేమరాజు పర్యవేక్షణలో ఆరుగురు వైద్య నిపుణులు 396 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉప సర్పంచ్ బైర్రాజు సత్యరాజు, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు ఉప్పులూరి రామకృష్ణాంజనేయులు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లులో 535 మందికి..

చాగల్లు: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆర్థోపెడిక్, డెంటల్, జనరల్, గైనకాలజీ, ఆప్తమాలజీ విభాగాల వైద్యులు 535 మంది రోగులను పరీక్షించి, సేవలు అందించారు. వారిలో 46 మందిని ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. 37 మందికి ఈసీజీ తీశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, ఎంపీటీసీలు ఉన్నమట్ల విజయకుమారి, ఎస్కే పాషా, జాలెం వెంకట్రావు, ఎంపీడీవో బి. రాంప్రసాద్, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, వైద్యులు కె లక్ష్మీ ప్రియ, ఈ.తనూజ, ఎం.సౌజన్య, సీహెచ్‌వో సుధీర్ పాల్గొన్నారు.



కొవ్వూరు మండలం ధర్మవరం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ధర్మవరంలో 617 మందికి..

కొవ్వూరు: ధర్మవరంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 617 మందికి వైద్యులు సేవలు అందించారు. ఈ వైద్య శిబిరాన్ని ధర్మవరం సర్పంచ్ నేరుడుమిల్లి నాగమణి ప్రారంభించారు. మలకపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బి. మైఖేల్ ఆధ్వర్యంలో వివిధ విభాగాల వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. 119 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 84 మంది కళ్లజోళ్లు అందజేశారు. 30 మందికి ఆరోగ్యశ్రీ వైద్యానికి సిఫార్సు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వెంపాటి సురేష్, వెంపాటి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు జొన్నకూటి రోహిణి కోమలి, బొబ్బన కృష్ణ, పోలిశెట్టి సత్యనారాయణ ,జలాది రవికుమార్ పాల్గొనానరు. ఈఎన్‌టీ వైద్య నిపుణుడు జి.శ్రీనివాసరావు, గైనకాలజిస్టు తమలిక, డాక్టర్ ప్రవీత సేవలు అందించారు.

ఆసుపత్రిలో బోరు ఏర్పాటుకు పూజలు



ఆసుపత్రి ప్రాంగణంలో నూతన బోరుకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

కొవ్వూరు: పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ప్రాంగణంలో కొత్తగా వేస్తున్న బోర్‌కు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆ వార్డు కౌన్సిలర్ తోట లక్ష్మీ ప్రసన్న, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నగ్గులపాటి శ్రీనివాస్, వరిగేటి సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్ పూజలు చేశారు. దొమ్మేరు సొసైటీ మాజీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో బోరు, మోటార్ ఏర్పాటుకు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత రూ.2.10 లక్షలు మంజూరు చేయించారని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

స్వచ్ఛంద సేవకుడు వెలిచెర్ల మృతి



జనార్దనరావు (ఫైల్)

నల్లజర్ల: కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల్లో దీర్ఘకాలం పాటు కార్యకర్తగా పనిచేసిన అనంతపల్లికి చెందిన స్వచ్ఛంద సేవకుడు వెలిచెర్ల జనార్ధనరావు (65) మృతి చెందారు. రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు బళ్ళ నాని, చిక్కాల నాగేశ్వరరావు, ముత్యాల నాని, ప్రత్తి మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.